

మా వాళ్లను కొట్టి వారిపైనే కేసులు పెట్టారు..

మా వాళ్లను కొట్టి వారిపైనే కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారని దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. - 8లో..



ఇదేంపని స్వామీ..!

మంత్రి స్వామి ఆదేశించాడని పొన్నలూరు మండలం చౌటపాలెంలో వినాయక నిమజ్జనాన్ని పోలీసులు అడ్డుకోవడంతో రెండు రోజులుగా వినాయక విగ్రహం రోడ్డు మీదే ఉంది. - 8లో..

గరిష్టం/కనిష్టం
36.5/28

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడా చిరుజల్లులు పడవచ్చు.



గత ప్రభుత్వ విధానాన్ని కొనసాగించాలి

వైద్య విద్యను పేద విద్యార్థులకు దూరం చేయడం చంద్రబాబు ప్రభుత్వానికి తగదు. ప్రైవేటు మెడికల్ కళాశాలల్లో పేద విద్యార్థులను చదివించలేరన్న ఉద్దేశంతోనే గత ప్రభుత్వం 17 మెడికల్ కాలేజీల నిర్మాణాలను ప్రారంభించింది. అందుకోసం రూ.8,480 కోట్లు కేటాయించింది. ఇప్పుడు ఎన్నికైన కూటమి ప్రభుత్వం ఈ కాలేజీల్లో మంజూరైన సీట్లు వద్దంటూ ఎన్ఎంసీకి లేఖ రాయడం దుర్మార్గం. ఈ విషయంలో కేంద్రం జోక్యం చేసుకొని 17 కళాశాలలను పూర్తి చేయాలి. మార్కాపురం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో అడ్మిషన్లు మొదలు పెట్టాలి.

- ఎల్.రాజశేఖర్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు, ఒంగోలు





మాటమార్చిన కూటమి మోసం చేసింది

ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం వైద్య విద్యార్థులను మోసం చేసింది. వైద్య విద్యను ప్రైవేటీకరించాలన్న ఆలోచన దుర్మార్గం. ఈ నిర్ణయం వలన ఎంతో మంది నిరుపేద, మధ్య తరగతి విద్యార్థులు వైద్య విద్యకు దూరం అవుతారు. రిజర్వేషన్ల ఊసు ఉండదు కనుక దళిత, వెనకబడిన వర్గాలకు నష్టం జరుగుతుంది. భవిష్యత్తులో ఉచిత వైద్య సేవలు కూడా అందుబాటులో లేకుండా పోయే ప్రమాదం ఉంది. పులివెందులకు వచ్చిన 50 సీట్లను వెనక్కి తీసుకోవడం సరైంది కాదు. కనుక ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్ఎంసీకి ఇచ్చిన లేఖను వెనక్కి తీసుకోవాలి.

- సీహెచ్ వినోద్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, ఒంగోలు.

న్యూస్‌రీల్

మా మాట వినకుంటే సస్పెన్షనే

● విద్యుత్ ఏఈ, ఏఎల్ఎంపై సస్పెన్షన్ వేటు

మద్దిపూడి: అధికారంలో ఉన్నాం మా మాట వినకుంటే ఏ అధికారికైనా ఇదే శిక్ష అంటూ విద్యుత్‌శాఖ సిబ్బందిపై టీడీపీ సానుభూతిపరులు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. వివరాల్లోకి వెళితే మద్దిపూడి మండలంలోని గుండ్లసముద్రం పంచాయతీ పరిధిలో ఏఎల్ఎంగా పనిచేస్తున్న భోగసముద్రం బాలకృష్ణారెడ్డి, మండల విద్యుత్ శాఖ ఏఈగా పనిచేస్తున్న రామకృష్ణారెడ్డిపై ఆ శాఖ ఉన్నతాధికారులు టీడీపీ సానుభూతిపరుల మాట విని విచారణ పేరుతో సస్పెన్షన్ వేటు వేశారు. గుండ్లసముద్రం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుడు చంద్రమౌళి నాకు 25 హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్ వెంటనే ఏర్పాటు చేయాలని ఏఎల్ఎం, ఏఈ లకు హుకుం జారీ చేశాడు. ముందుగా దరఖాస్తు చేసుకుంటే ఆ తర్వాత ఎస్టిమెట్ వేసి, శాంక్షన్ అయ్యాక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని విద్యుత్ సిబ్బంది చెప్పడంతో చిర్రెత్తిన ఆ టీడీపీ సానుభూతిపరుడు అధికారంలో ఉన్నాం, అడిగిన వెంటనే ఎందుకు పనిచేయరు అనే పట్టుదలతో అదే గ్రామానికి చెందిన మరో ఇద్దరు వ్యక్తులను రెచ్చగొట్టి ఆ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయించారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు లంచం అడుగుతున్నారని కక్షకట్టి ఈ నెల 11 న విజిలెన్స్ డీఈ కట్టా వెంకటేశ్వర్లు, దర్శి డీఈ కరీం లను అధికారులుగా నియమించి విచారణ చేపట్టారు. ఎలాంటి లంచాలు తీసుకోకపోయినా కక్షసాధింపు చర్యగా ఆ గ్రామంలో విచారణ పేరుతో ఏఎల్ఎం బాలకృష్ణారెడ్డి, ఏఈ రామకృష్ణారెడ్డిల పై సస్పెన్షన్ వేటు వేశారు.

నేటి నుంచి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

ఒంగోలు: ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి సెప్టెంబర్ నెల స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ఈ నెల 17, 18 తేదీల్లో నిర్దేశించిన స్కూల్ కాంప్లెక్స్‌లో సమావేశాలు నిర్వహిస్తారని జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17 వ తేదీ కాంప్లెక్స్ పరిధిలోని 50 శాతం మంది ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు తెలుగు, మాథ్స్, బయాలజీ టీచర్లు, నియోజక వర్గ స్థాయి లో వ్యాయామ ఉపాధ్యాయులకు, 18 వ తేదీ మిగిలిన 50% ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, హిందీ, ఇంగ్లిష్, పీఎస్, సోషల్ సబ్జెక్టులకు సంబంధించిన వారు హాజరు కావాలన్నారు. 100 శాతం మంది హాజరు కావాలని, ఉదయం గం.9 నుంచి సాయంత్రం గం.4.20 ని. వరకు నిర్వహించాలన్నారు. స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్స్ మండల విద్యాశాఖ అధికారుల సమన్వయంతో రిసోర్స్ పర్సన్స్ ను ఎంపిక చేసుకొని, అజెండా ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొనే ఉపాధ్యాయులంతా ఫీడ్ బ్యాక్ ఫాంను నింపాలని ఆదేశించారు. ఉపవిద్యాశాఖాధికారులు, డైట్ సిబ్బంది, మండల విద్యాశాఖాధికారులు, సమగ్ర శిక్ష సెక్టోరల్స్ అధికారులు కార్యక్రమాలను పర్యవేక్షణ చేయాలని డీఈవో డి.సుభద్ర ఆదేశించారు.

పలువురు ఎస్ఐలకు స్థానచలనం

ఒంగోలు టౌన్: జిల్లాలో 13 మంది ఎస్ఐలకు స్థానచలనం చేస్తూ ఎస్పీ ఏఆర్ దామోదర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కనిగిరి ఎస్ఐ టి.త్యాగరాజు ను జిల్లా వీఆర్‌కు పంపి ఆయన స్థానంలో వీఆర్‌లో ఉన్న టి.శ్రీరాంను నియమించారు. హనుమంతునిపాడు ఎస్ఐ పి.శివ నాగరాజును వీఆర్‌కు పంపించి ఆయన స్థానంలో వీఆర్‌లో ఉన్న కె.మాధవరావును నియమించారు. జిల్లా వీఆర్‌లో ఉన్న జి.కోటయ్యను పీసీపల్లి పోలీసు స్టేషన్‌కు పోస్టింగ్ ఇచ్చారు. ఒంగోలు వన్‌టౌన్ ఎస్ఐ టి.కిశోర్ బాబును పామూరు పీఎస్‌కు, సీఎస్‌పురం ఎస్ఐ బి.ప్రేమ్ కుమార్‌ను వీఆర్‌కు బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న ఆర్ సుమన్‌ను సీఎస్ పురం ఎస్ఐగా బదిలీ చేశారు. అలాగే కొమరోలు ఎస్ఐ కె.మధుసూదనరావును వెలిగండ్ల పీఎస్‌కు, వీఆర్‌లో ఉన్న ఎం. రాములు నాయక్‌ను కొమరోలుకు స్థానచలనం చేశారు. వీఆర్‌లో ఉన్న టి.రాజ్ కుమార్‌ను కొనకనమిట్ల, వీఆర్‌లో ఉన్న మరో ఎస్ఐ బి.బ్రహ్మనాయుడును తర్లుపాడు, వీఆర్‌లో ఉన్న పి.రాజేష్ ను పుల్లలచెరువు పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. మొత్తం మీద వీఆర్‌లో ఉన్న 8 మంది ఎస్ఐలకు పోస్టింగ్ ఇచ్చారు.

23 వరకు ఈ-పంట నమోదు

ఒంగోలు సెంట్రల్: ఈ-పంట నమోదును ఈ నెల 23వ తేదీ వరకూ కొనసాగించనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ముందుగా ఈ నెల 15వ తేదీ వరకు మాత్రమే ఈ-పంట నమోదు చేయనున్నట్లు ప్రకటించారు. వరుస సెలవుల నేపథ్యంలో.. గడువు తేదీని 23 వరకు పొడిగించారు. 25-27 తేదీల మధ్య గ్రామ సభలు నిర్వహించి 28-29 మధ్య అభ్యంతరాలు స్వీకరించి అర్హుల తుది జాబితాను సెప్టెంబర్ 30వ తేదీ విడుదల చేయనున్నట్లు వివరించారు.

దేవుడ్నీ వదలని పచ్చదండు

భక్తిప్రపత్తులతో..ఎంతో ఉత్సాహంగా సాగాల్సిన వినాయక నిమజ్జనోత్సవాలను టీడీపీ నాయకులు కక్షసాధింపు చర్యలకు వేదికగా మార్చుకున్నారు. అడుగడుగునా ఆధిపత్య ధోరణి ప్రదర్శిస్తూ పోలీసులనూ పావులుగా వాడుకుని వైఎస్సార్ సీపీ సానుభూతిపరులే లక్ష్యంగా దాడులకు తెగబడ్డారు. ఇళ్లలోకి దూరి మరీ మహిళలపై దౌర్జన్యానికి దిగారు. సాక్షాత్తు మంత్రి స్వామి నియోజకవర్గంలోనే ముందస్తుగా అన్ని అనుమతులు తీసుకున్న తమ బొమ్మను నిమజ్జనం చేయనివ్వకుండా రెండు రోజులుగా అడ్డుకుంటున్నారంటూ వందల మంది మహిళలు ఏకంగా పోలీస్‌స్టేషన్ ముందు ధర్నాకు దిగాల్సిన పరిస్థితికి తీసుకొచ్చారు. టీడీపీ నాయకుల ఆదేశాలకు తలొగ్గి తమ బాధ్యత మరిచిన పోలీసులు కీలుబొమ్మల్లా వారు చెప్పినట్టు ఆడటంపై జనం మండిపడుతున్నారు.



మంత్రి స్వామి ఆదేశాలతో చౌటపాలెంలో రెండు రోజులుగా నిమజ్జనానికి నోచుకోక రోడ్డుపైనే నిలిచి ఉన్న వినాయక విగ్రహం వద్ద కాపలా ఉన్న పోలీసులు

- గణేష్ నిమజ్జనాల్లో జిల్లా వ్యాప్తంగా టీడీపీ కార్యకర్తల దాడులు
- దర్శి నియోజకవర్గంలో పలు గ్రామాల్లో ఇళ్లలోకి దూరి మహిళలపై దౌర్జన్యం
- నిబంధనలకు వ్యతిరేకంగా రాత్రిపూట మహిళలను పోలీసు స్టేషన్‌కు తరలింపు
- మంత్రి స్వామి నియోజకవర్గంలో స్వామి భక్తి ప్రదర్శించిన పోలీసులు
- చౌటపాలెంలో నిమజ్జనాన్ని నిలిపేసి అత్యుత్సాహం
- పుల్లలచెరువులో సుగాలీ మహిళలపై కర్రలతో దాడులు చేసిన పచ్చదండు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: హిందువులకు తొలి పెద్ద పండుగ వినాయక చవితి. ఈ పండుగ సందర్భంగా భక్తులు ఊరు వాడా వినాయకుడి విగ్రహాలకు ఏర్పాటు చేసుకుంటారు. భక్తి శ్రద్ధలతో 9 రోజుల పాటు పూజలు చేస్తారు. అనంతరం భారీ ఊరేగింపులు నిర్వహించి నిమజ్జనం చేస్తారు. అయితే ఇదంతా గతం. ఈ ఏడాది ఎప్పుడూ లేని విధంగా కూటమి నాయకులు పండుగలోకి చొరబడ్డారు. ప్రధానంగా తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పండుగ ఆద్యంతం తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకు ప్రయత్నించారు. ఇళ్లల్లోకి దూరి మహిళలను సైతం వదిలి పెట్టకుండా దాడులకు పాల్పడ్డారు. పోలీసుల అండతో రెచ్చి పోయిన పచ్చ మూక పండుగను పార్టీ వ్యవహారంలా మార్చేశారు. కొండపి నియోజకవర్గంలో మంత్రి బాలవీరాంజనేయ స్వామి మెప్పు పొందేందుకు పోలీసులు ఏకంగా నిమజ్జన కార్యక్రమాన్ని నిలిపివేయడం విమర్శల పాలవుతోంది. ఒంగోలులో వినాయక మండపం పైనుంచి వినాయకుడి విగ్రహాన్ని కిందకు దించడం చూసి జనం అవాక్కవుతున్నారు.

ఇదేం స్వామి భక్తి ఖాకీ సారూ...

వినాయక చవితి పండుగ సందర్భంగా పోలీసులు వ్యవహరించిన తీరుతో పొన్నలూరు మండలంలోని చౌటపాలెం గ్రామంలో చిచ్చురాజుకుంది. మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి మీద భక్తి ప్రపత్తులను చాటుకునేందుకు పోలీసులు వినాయక నిమజ్జనాన్ని వాడుకున్నారు. గ్రామంలో తెలుగు దేశం పార్టీకి చెందిన వారు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు వేర్వేరుగా మండపాలను ఏర్పాటు చేసుకున్నారు. శనివారం రోజు నిమజ్జనం చేయాలని నిర్ణయం తీసుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరులు అందుకు పోలీసుల అనుమతి సైతం తీసుకున్నారు. టీడీపీ నాయకులు కూడా అదేరోజు నిమజ్జనం చేస్తామని భీష్మించుకొని కూర్చున్నారు. దాంతో రంగ ప్రవేశం చేసిన పోలీసులు వైఎస్సార్ కాంగ్రెస్ సానుభూతిపరులు ఏర్పాటు చేసుకున్న వినాయకుడి విగ్రహాన్ని ఆదివారం నిమజ్జనం చేసుకోవాలని ఆదేశించారు. పోలీసుల నిబంధనల ప్రకారం ఆదివారం నిమజ్జనం చేసుకునేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సిద్ధమై మరోసారి అనుమతులు కూడా తెచ్చుకున్నారు. ఆదివారం నిమజ్జనానికి సిద్ధమౌతుండగా ఈ రోజు కూడా నిమజ్జనం చేయడానికి వీలులేదని, ఇంటలిజెన్స్ రిపోర్టు ప్రకారం గ్రామంలో ఘర్షణలు జరిగే అవకాశం ఉన్నట్లు మాకు సమాచారం ఉందని సాకు చెప్పి అడ్డుకున్నారు. మంత్రి స్వామి, టీడీపీ నాయకుడు దామచర్ల సత్య ఆదేశాలతో ఎస్ఐ గిరిబాబు గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని అడ్డుకున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామస్తులు పోలీసు స్టేషన్ ఎదుట ధర్నాకు దిగినా పోలీసులు దిగిరాలేదు. ఊరేగింపునకు అనుమతి ఇవ్వలేదు. దేవుడి కార్యక్రమంలో రాజకీయాలు ఎందుకంటూ బతిమాలినా వినలేదు. పైగా మహిళలపై లాఠీచార్జికి దిగారు. నాలుగు రోజుల తరువాత నిమజ్జనం చేసుకోవాలని సూచించారు. దాంతో ఇక మేము నిమజ్జనం చేయమని, పోలీసులే చేయాలని తేల్చి చెప్పిన గ్రామస్తులు విగ్రహాన్ని అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. మంత్రి స్వామి భక్తిని చాటుకోవడం కోసం పోలీసులు ప్రశాంతంగా గ్రామంలో చిచ్చుపెట్టారని ప్రజలు మండిపడుతున్నారు.



పొన్నలూరు పోలీస్‌స్టేషన్ ముందు ధర్నా చేస్తున్న చౌటపాలెం మహిళలు

పోలీసుల బందోబస్తు ఏమైంది...

వినాయక చవితిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ ప్రకటించడం తెలిసిందే. అయితే చవితి ఊరేగింపుల సందర్భంగా జిల్లాలో జరిగిన ఘర్షణలు, దాడులను చూస్తే పోలీసు బందోబస్తు ఏమైందన్న సందేహం కలుగుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. కొండపి నియోజకవర్గంలో నిమజ్జనం చేయకుండానే ఒకవర్గం ప్రజలు వెళ్లిపోవడానికి కారణమైన పోలీసులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి. దర్శిలో నిబంధనలకు వ్యతిరేకంగా మహిళలను పోలీసు స్టేషన్‌కు తీసుకొని వచ్చిన ఎస్ఐ మురళిని సస్పెండ్ చేయాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

యర్రగొండపాలెంలో రెచ్చిపోయిన పచ్చమూకలు...

వినాయకుడి ఊరేగింపు సందర్భంగా యర్రగొండపాలెం మండలంలోని పందివాని పల్లె, పుల్లలచెరువు మండలంలోని అక్కపాలెం గ్రామాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులపై పచ్చమూకలు దాడులకు పాల్పడ్డారు. పందివాని పల్లెలో వినాయకుడి విగ్రహాన్ని ఊరేగింపు సందర్భంగా దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహం వద్దకు వచ్చిన వెంటనే రెచ్చి పోయారు. విగ్రహం వద్ద భారీ ఎత్తున టపాసులు కాల్చడమే కాకుండా పసుపు చల్లిన నీరు చల్లడం వివాదంగా మారింది. వైఎస్సార్ కాంగ్రెస్ శ్రేణులు వారించడంతో వారిపై దాడికి దిగారు. తీరిగ్గా రంగంలోకి దిగిన పోలీసులు ఇరువర్గాలపై కేసులు పెట్టి చేతులు దులుపుకున్నారు. పుల్లలచెరువు మండలంలోని అక్కపాలెంలో సుగాలీ దంపతులైన బ్రహ్మా నాయక్, వర్షాబాయ్‌లపై దాడి చేసి గాయపరిచారు. అక్కపాలెం సుగాలి తండాకు చెందిన ఈ దంపతులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరులు. ఈ నెల 12వ తేదీ గ్రామంలో నిమజ్జనం సందర్భంగా ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపులో పాల్గొన్న ఈ దంపతులు తండా నుంచి మరికొందరితో కలిసి వచ్చి సంప్రదాయ నృత్యాలు చేశారు. దాంతో టీడీపీ శ్రేణులు వీరి మీద కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేసి గాయపరిచారు. అర్ధవీడు మండలంలోని మాగుటూరులో వినాయక చవితి పండుగ సందర్భంగా జరిపిన ఊరేగింపులో టపాసులు కాల్చారు. రహదారి పక్కనే ఉన్న టీడీపీ సానుభూతిపరుడైన సుబ్బయ్య నివాసం ఉంది. టపాసుల నుంచి వెలువడిన నిప్పురవ్వలు పడి ఇంటి కర్టెన్ కొద్దిగా బెజ్జం పడింది. ఈ ఘటనను రాజకీయం చేసిన పచ్చదండు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 15 మందిపై కేసు నమోదు చేయించారు. గ్రామంలో లేని వారిపై కూడా కేసులు పెట్టడం వెనక మతలబేమిటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.



పుల్లలచెరువు మండలం అక్కపాలెంలో టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన వర్షాబాయ్ (ఫైల్)

దర్శిలో ఇళ్లలోకి దూరి మహిళలపై దాడులు..

దర్శి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో టీడీపీ శ్రేణులు బరితెగించారు. వినాయక చవితి వేడుకలను సాకుగా తీసుకొని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరుల ఇళ్లపై దాడులకు పాల్పడ్డారు. ఇళ్లలో ఉన్న వస్తువులను ధ్వంసం చేయడమే కాకుండా అడ్డొచ్చిన మహిళలను కర్రలతో చితకబాదారు. మండలంలోని చలివేంద్ర గ్రామంలో వినాయక చవితి పండుగ సందర్భంగా టీడీపీ నాయకుల ప్రోద్బలంతో ఎస్ఐ మురళి రెచ్చిపోయారు. ఇంటి మీద పడి దాడి చేయడమే కాకుండా నిబంధనలకు వ్యతిరేకంగా మహిళా పోలీసులు లేకుండానే 12 మంది మహిళలను పోలీసు స్టేషన్‌కు తీసుకొని వచ్చి కూర్చోబెట్టారు. రాత్రి 9 గంటల సమయంలో మహిళలను పోలీసు స్టేషన్‌కు తీసుకొని రావడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నా పోలీసులకు చీమకుట్టినట్టయినా లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దర్శి మండలంలోని దేవవరం గ్రామంలో కూడా ఇదే తంతు కొనసాగింది. గణేష్ నిమజ్జనం సందర్భంగా గ్రామంలో జరిగిన ఊరేగింపులో పాల్గొన్న ఎల్లో గ్యాంగ్ దారిలో ఒకపక్కకు కట్టి ఉన్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ఫ్లెక్సీలను చించివేశారు. గ్రామంలో అలజడి సృష్టించారు. దర్శి మండలంలోని బండివెలిగండ్ల గ్రామంలో కూడా పచ్చమూకలు మహిళలపై దాడులకు తెగబడ్డారు. కాళ్లతో ఇష్టమొచ్చినట్లు తన్నారు.

కురిచేడు మండలంలో పచ్చదండుపాల్యం బ్యాచ్ రౌడీయిజానికి దిగింది. మండలంలోని దేకనకొండ గ్రామంలో ఊరేగింపునకు బయలు దేరిన గుంపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరుల ఇళ్లు కనిపించగానే రెచ్చి పోయారు. ఒక వ్యూహం ప్రకారం ఇళ్లలోకి దూరి దాడులు ప్రారంభించారు. కర్రలు పట్టుకొని కనిపించిన వారిని కనిపించినట్లు దాడిచేసి గాయపరిచారు.



కురిచేడు మండలం దేకనకొండలో ఇళ్లపై నుంచి రాళ్లు రువ్వుతున్న కూటమి వర్గీయులు (ఫైల్)

క్రీడలతో ఉపాధ్యాయుల మధ్య స్నేహభావం

● ముగిసిన యూటీఎఫ్ జిల్లా స్థాయి ఆటల పోటీలు

ఒంగోలు: క్రీడా పోటీలతో ఉపాధ్యాయుల మధ్య స్నేహభావం, సమైక్యత, సహకార భావం అలవాటైందని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు అన్నారు. స్థానిక డీఆర్ఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో రెండు రోజులుగా జరుగుతున్న యూటీఎఫ్ జిల్లా స్థాయి ఆటల పోటీలు సోమవారం ముగిశాయి. రెండో రోజు ఆటల పోటీల ముగింపు అనంతరం శ్రీనివాసరావు మాట్లాడారు. జిల్లా స్థాయిలో క్రికెట్, వాలీబాల్, టెన్నికాయిట్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, క్యారమ్స్, 100 మీటర్స్, రన్నింగ్ 200 మీటర్స్ రన్నింగ్, 400 మీటర్స్ స్పీడ్ వాకింగ్, జావలిన్‌త్రో, షాట్ పుట్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. రెండు రోజులు సుమారు 600 పైగా ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు డిసెంబర్ 14, 15, 16, 17 తేదీల్లో కాకినాడలో జరగనున్నాయి. ఈ సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించారు. చివరి రోజు ఆటల్లో క్రికెట్‌లో మొదటి స్థానం వైపాలెం జట్టు, రెండో స్థానం ముండ్లమూరు జట్టు, అదేవిధంగా ఉమెన్స్ 400 మీటర్స్ స్పీడ్ వాకింగ్ లో ఎల్ఆర్ఎస్ స్రవంతి, అరుణ కుమారి, మెహిబూన్, శ్రీదేవి, 400 మీటర్స్ బిలో 45 విభాగంలో మొదటి స్థానం వి.కవిత, రెండవ స్థానం వీ కల్పన, మూడో స్థానం జగదీశ్వరి, ఎస్.కె బషీర సాధించారు.



క్రికెట్ పోటీలలో ప్రథమస్థానంలో నిలిచిన వై.పాలెం జట్టు

100 మీటర్స్ బిలో 45 ఉమెన్స్ విభాగంలో మొదటి స్థానం ఎస్కే మహిబూన్, రెండవ స్థానం ఎల్లా స్రవంతి, మూడో స్థానం టీ మీరా కుమారి, షాట్ పుట్ విభాగంలో మొదటి స్థానం ముండ్లమూరు మండలం చెందిన బీ బ్రహ్మయ్య, రెండవ స్థానం ఎస్కే సూరత్ బాషా, మూడోస్థానం కే శివ కోటేశ్వరరావు విజయం సాధించారు. రెండో రోజు ఆటల పోటీల్లో జిల్లా ఆటల కమిటీ కన్వీనర్ షేక్ అబ్దుల్ హై, జిల్లా అధ్యక్షుడు ఓ వీరారెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎస్ రవి, జిల్లా సహాధ్యక్షురాలు జీ ఉమామహేశ్వరి, జిల్లా కోశాధికారి చిన్నస్వామి జిల్లా కార్యదర్శి పీ బాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో వర్గ విభేదాలు

- బెల్లంకొండ సాయిబాబు వ్యాఖ్యలను ఖండిస్తున్న జనసేన నాయకులు
- సోషల్ మీడియా ద్వారా ఆగ్రహం వ్యక్తం చేసిన కంభం మండల జనసేన నాయకుడు

కంభం: జనసేన పార్టీలో వర్గవిభేదాలు భగ్గుమంటున్నాయి. ఆదివారం ఒంగోలులో జనసేన గిద్దలూరు నియోజకవర్గ సమన్వయకర్త బెల్లంకొండ సాయిబాబు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు రియాజ్ ను మార్చాలంటూ వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో గిద్దలూరు నియోజకవర్గంలో పలువురు జనసేన నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కంభం మండల జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి షేక్ అజ్మతుల్లా సోమవారం సోషల్ మీడియా ద్వారా ఆగ్రహం వ్యక్తం చేశారు. గిద్దలూరు నియోజకవర్గంలో జనసేన బలోపేతానికి పార్టీ సమన్వయకర్త బెల్లంకొండ సాయిబాబు ఏం చేశారో చెప్పాలన్నారు. తప్పుడు నివేదికల ద్వారా టీడీపీకి సీటు వచ్చిందని చెప్పే బెల్లంకొండ సాయిబాబు ఎన్నికలకు ముందు జనసేన బలంగా ఉందని ఎందుకు ప్రశ్నించలేదన్నారు. జనసేన పార్టీ ఇక్కడ బలంగా ఉందని ఆయన ఎలా చెబుతున్నారని పార్టీ బలోపేతం కోసం ఆయన ఏం చేశారో చెప్పాలన్నారు. ఈ ఐదేళ్లల్లో ఆరు మండలాల్లో ఒక్క చోటైనా పార్టీ కార్యాలయం కూడా పెట్టలేక పోయారని, జెడ్పీటీసీ గా మీరు పోటీ చేస్తే మీకు ఎన్ని ఓట్లు వచ్చాయో గుర్తు చేసుకోవాలని అన్నారు. కనీసం కార్యకర్తలకు కూడా భరోసా ఇవ్వలేక పోయారన్నారని అలాంటి మీరు జిల్లా రాజకీయాల గురించి ఎలా మాట్లాడుతారని సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించారు.

పవిత్రోత్సవాలు ప్రారంభం



పవిత్రోత్సవాల అంకురార్పణ కార్యక్రమంలో పాల్గొన్న వేదపండితులు

సింగరాయకొండ:

పురాణ ప్రసిద్ధి చెందిన పాతసింగరాయకొండ వరాహలక్ష్మీ నరశింహస్వామి దేవస్థానంలో సోమవారం స్వామి వారి పవిత్రోత్సవ కార్యక్రమం అత్యంత కన్నుల పండుగగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్ఛరణలతో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అంకురార్పణ చేశారు. ఈ ఉత్సవాలు ఈనెల 19వ తేదీ గురువారం వరకు జరగనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు ఉదయగిరి వెంకట లక్ష్మీనరశింహాచార్యులు వివరించారు.

అండర్ 14 ప్రకాశం జిల్లా క్రికెట్ జట్టు ఇదే



అండర్-14 బాలుర క్రికెట్ టీమ్ సభ్యులతో సెలక్షన్ కమిటీ సభ్యులు, కోచ్‌లు

ఒంగోలు: అండర్ 14 ప్రకాశం జిల్లా క్రికెట్ జట్టును ఎంపిక చేసినట్లు ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగిశెట్టి మోహన్‌దాస్, కారుసాల నాగేశ్వరరావు ప్రకటించారు. రావినూతల క్రికెట్ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో రాణించిన క్రీడాకారులతో జట్టును ఎంపిక చేశారన్నారు. 16 మందితోపాటు ఆరుగురిని స్టాండ్‌బైలుగా జట్టు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఎంపికైన వారు అక్టోబరు 1 నుంచి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ నిర్వహించే పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఎంపిక ప్రక్రియను మాజీ రంజీ ప్లేయర్ తాటికొండ వంశీకృష్ణ, రాష్ట్రస్థాయి మాజీ క్రీడాకారుడు శ్రీకృష్ణ విజయకుమార్ పర్యవేక్షించారు.

ఎంపికైన జట్టు:

ఆర్.హేమంత్ రాయల్ (కెప్టెన్, వికెట్ కీపర్), ఏవీ చరణ్ (వైస్ కెప్టెన్), ఎం.లిఖిత్, బి.లోకేష్, ఐవీ నీరజ్, పి.రాజమోహన్ (వికెట్ కీపర్), ఎం.పృథ్వీ రాజ్, బీవీ శైలేంద్ర, కె.రామ్‌చరణ్, జె.దినేష్, కె.ఉదయ్‌నాయుడు, ఎస్‌కె లతీఫ్, బి.నిరంజన్, బి.నిషాంత్, ఎం.సిద్దార్థ్, వి.రిషిక్ చక్రవర్తి, స్టాండ్ బైలుగా ఎం.గగన్‌రెడ్డి, ఆర్.నీరజ్, ఎస్‌వీఎస్ఎస్ కిరణ్, జి.కౌషిక్, కె.శ్రీకాంత్. టి.శ్యామ్‌దీపక్.



మార్కాపురంలో మెడికల్ కాలేజీని ప్రారంభించాలి

మార్కాపురం పట్టణంలో మెడికల్ కళాశాలను ప్రభుత్వం త్వరగా ప్రారంభించాలి. నాతో పాటు నీట్ రాసిన మా ఫ్రెండ్స్‌కు కొత్త మెడికల్ కాలేజీల్లో సీట్లు వచ్చే అవకాశం ఉంది. మా పట్టణంలో మెడికల్ కాలేజీ ప్రారంభిస్తే నేను ఇక్కడే ఉండి చదువుకుంటాను. మార్కాపురం మెడికల్ కాలేజీని నీట్ కౌన్సిలింగ్‌లో చేరిస్తే మేము మార్కాపురం మెడికల్ కాలేజీని ఆప్షన్‌గా ఎంచుకుని ఇక్కడే చదువుకుంటాము. దీని వలన మా తల్లిదండ్రులపై ఆర్థికభారం తగ్గుతుంది. డివిజన్‌లో నీట్ క్వాలిఫై అయిన వారందరూ ఇక్కడే చదుకుంటారు.

– టీ హారిక, నీట్ విద్యార్థి, మార్కాపురం



వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేసే కుట్రను ఆపాలి



వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేసే కుట్రను కూటమి ప్రభుత్వం ఆపాలి. రాష్ట్రంలో వైద్య విద్యపై చంద్రబాబు ప్రభుత్వం కుట్ర చేస్తోంది. గుజరాత్ తరహాలో వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేసేందుకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. రాష్ట్రంలో నాడు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ, జనసేన, బీజేపీలు.. గత ప్రభుత్వం వైద్య విద్యను వ్యాపారంగా చేస్తోందంటూ గగ్గోలు పెట్టారు. కానీ, నేడు అధికారంలోకి వచ్చాక అవే పార్టీలు చేస్తున్న పని ఏంటి.? దళితులు, వెనుకబడిన వర్గాలు, మైనార్టీలకు ద్రోహం చేయాలని చూస్తే సహించేది లేదు. ప్రభుత్వం తక్షణమే 107, 108 జీవోలు రద్దు చేయాలి. ఆయా కళాశాలలకు పూర్తిస్థాయిలో భవనాలు నిర్మించి మౌలిక వసతులు కల్పించాలి. అన్ని రకాల పోస్టులతో పాటు పూర్తి స్థాయిలో ఎంబీబీఎస్ సీట్లు భర్తీ చేయాలి.

– పవన్ కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి

క్లుప్తంగా

రేపు ఒంగోలు జాతి పశువులకు బహిరంగ వేలం

నాగులుప్పలపాడు: మండలంలోని చదలవాడ పశుక్షేత్రంలో ఒంగోలు జాతి పశువులకు ఈ నెల 18వ తేదీ బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పశుక్షేత్రం డీడీ రవికుమార్ తెలిపారు. వేలం ప్రక్రియలో ఒంగోలు జాతి పాడి ఆవులు 10, ఒట్టి ఆవులు 13, పెయ్యలు 13, కోడెలు 10, కోడె దూడలు 20 కలిపి మొత్తం 66 పశువులకు వేలం నిర్వహించనున్నట్లు వివరించారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా రూ.5 వేల ధరావత్తు చెల్లించాలని, పూర్తి వివరాలకు 93929 01049 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

నేడు విశ్వకర్మ జయంతిని విజయవంతం చేయాలి

ఒంగోలు సెంట్రల్: జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారిత శాఖ ఆధ్వర్యంలో స్థానిక పాత రిమ్స్ వద్ద జిల్లా బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం విశ్వకర్మ జయంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారిత శాఖాధికారి ఎం.అంజల తెలిపారు. విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు చెప్పారు. నాయకులు, అధికారులు, విశ్వకర్మీయులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

భారీ విగ్రహాలతో విద్యుత్ కట్



నిమజ్జనానికి తరలుతున్న భారీ వినాయకుడి విగ్రహం



తీగలు తెగి విరిగిపడిన విద్యుత్ స్తంభం

కొత్తపట్నం: ఒంగోలు నుంచి కొత్తపట్నం సముద్రతీరానికి నిమజ్జనానికి వచ్చే భారీ వినాయక విగ్రహాలతో విద్యుత్ లైన్లు కట్ కావడమే కాకుండా స్తంభాలు కూడా విరిగిపోయి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. భారీ విగ్రహాలు వస్తున్నాయని సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రొయ్యల చెరువులకు, ఇళ్లకు, వ్యవసాయానికి కరెంట్ సరఫరా నిలిచిపోవడంతో వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. అల్లూరు, కొత్తపట్నం మధ్యలో భారతి పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న 11 కేవీ అల్లూరు ఫీడర్‌కు వెళ్లే విద్యుత్ లైన్ కట్ అయింది. రెండు విద్యుత్ స్తంభాలు కూడా విరిగిపోయాయి. దీంతో కొత్తపట్నం గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. భారీ విగ్రహాలను నియంత్రించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇదేంపని స్వామీ..!

- మంత్రి స్వామి ఆదేశాలతో చౌటపాలెంలో వినాయక నిమజ్జనాన్ని అడ్డుకున్న పోలీసులు
- రెండు రోజులుగా రోడ్డు పక్కనే వినాయకుడి బొమ్మ
- గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు
- వినాయకుడిని ఇలా ఉంచడం మంచిదికాదంటున్న గ్రామస్తులు
- మంత్రి స్వామి, పోలీసుల తీరుపై ప్రజల ఆగ్రహం



చౌటపాలెంలో పోలీసుల తీరును ప్రశ్నిస్తున్న మహిళలు

పొన్నలూరు: మంత్రి స్వామి ఆదేశించాడంటూ చౌటపాలెం గ్రామంలో వినాయక నిమజ్జనాన్ని అడ్డుకోవడంతో రెండో రోజు కూడా వినాయకుడు బొమ్మ రోడ్డు పక్కనే ఉంది. నవరాత్రుల్లో భాగంగా తొమ్మిది రోజులు పూజలందుకున్న గణనాథుడు మంత్రి స్వామి, పోలీసుల తీరుతో రెండు రోజులుగా పూజలు, పునస్కారాలు లేకుండా రోడ్డు పక్కనే ట్రాక్టర్‌పై ఉన్నాడు. అనుకున్న సమయానికి నిమజ్జనం చేయకపోతే గ్రామానికి అరిష్టమని గ్రామస్తులు వాపోతున్నారు. అయితే ఆదివారం రాత్రి నిమజ్జన కార్యక్రమాన్ని నిలిపివేయించిన మంత్రి స్వామి, పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన గ్రామస్తులు, మహిళలు ఆ రోజు రాత్రి పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేసిన విషయం తెలిసిందే. అయితే ధర్నా విరమిస్తే వినాయక ఊరేగింపు, నిమజ్జం చేసుకోవచ్చనని కొండపి సీఐ సోమశేఖర్ చెప్పడంతో గ్రామస్తులు, మహిళలు ధర్నా విరమించి గ్రామానికి వెళ్లిపోయారు. అయితే తీరా చౌటపాలెంకు వెళ్లిన తరువాత సీఐ సోమశేఖర్ మాటమార్చి అనుమతి నిరాకరించారు. దీంతో గ్రామస్తులు పోలీసులను నిలదీయడంతో ఎక్కువ మాట్లాడితే క్రిమినల్ కేసులు బనాయిస్తామని హెచ్చరించారు. దీంతో గ్రామస్తులు చేసేదేమీ లేక పోలీసుల చేష్టలకు విస్తుపోయి వినాయక బొమ్మను రోడ్డు పక్కనే ఉంచి ఇళ్లకు వెళ్లిపోయారు.

పోలీసులకు పదే పదే ఫోన్ చేసిన మంత్రి స్వామి...

స్థానిక టీడీపీ నాయకుల మాటలు విన్న మంత్రి స్వామి రాజకీయ కక్ష సాధింపులతో చౌటపాలెం గ్రామస్తులపై తమ అధికారాన్ని చూపిస్తూ పోలీసులకు పదే పదే ఫోన్ చేసినట్లు సమాచారం. గ్రామంలో వినాయక నిమజ్జనం జరగకుండా చూడాలని, అవసరమైతే ప్రశ్నించిన వారిపై కేసులు నమోదు చేసి జైల్లో పెట్టాలని పోలీసులకు హుకుం జారీ చేసినట్లు తెలుస్తోంది. తన మాట కాదని వినాయక ఊరేగింపు జరగనిస్తే మీ పరిస్థితి ఏందో తెలుసుగా అంటూ పోలీసులను హెచ్చరించినట్లు గ్రామస్తులు తెలిపారు. దేవుని విషయంలో రాజకీయం చేయడం సారికాదని పోలీసులు వివరించినా నేను చెప్పినట్లు చేయండి, కావాలంటే మీ ఎస్పీ మీకు ఆదేశాలు ఇస్తాడని వారిపైనే మంత్రి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

గ్రామస్తుల బంధువులపై పోలీసుల అక్కసు...

ఇదిఇలా ఉంటే ఆదివారం వినాయక బొమ్మను నిమజ్జనం చేస్తున్నామని, ఈ కార్యక్రమంలో పాల్గొనాలని గ్రామస్తులు వారి బంధువులను ఆహ్వానించారు. దీంతో గ్రామస్తుల పిలుపు మేరకు వచ్చిన బంధువులను అడ్డుకొని మీరు ఎందుకొచ్చారని పోలీసులు వారిని ప్రశ్నించి రెండు ట్రాక్టర్లను, 13 ద్విచక్ర వాహనాల తాళాలు తీసుకొని వారిపై కేసులు నమోదు చేస్తామని బెదిరించారు. అలాగే టీడీపీ నాయకులు పోలీసుల ఎదుటే గ్రామస్తుల బంధువులపై దాడికి ప్రయత్నం చేస్తున్నా పోలీసులు వారిని అడ్డుకోకపోవడం కొసమెరుపు. అయితే గ్రామంలో అందరూ చూస్తుండగా గత శనివారం వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీని తగలబెట్టిన ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోని పోలీసులు నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన బంధువులపై టీడీపీ నాయకుల కోరిక మేరకు కేసులు కట్టాలనుకోవడం ఏమిటంటూ గ్రామస్తులు పోలీసుల తీరుపై విస్మయం వ్యక్తం చేశారు.

మంత్రి స్వామి, పోలీసుల తీరుపై విమర్శలు...

చౌటపాలెం గ్రామంలో వినాయక నిమజ్జనం కార్యక్రమంలో రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడి గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనేలా చేసిన మంత్రి స్వామి, పోలీసుల తీరుపై ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. పార్టీలకు అతీతంగా సామాన్య ప్రజలు మంత్రి స్వామి చేష్టలను ప్రశ్నిస్తున్నారు. దేవుని విషయంలో రాజకీయాలు చేస్తూ కక్ష సాధింపు చర్యలకు దిగడం మంచి పద్ధతి కాదని విమర్శిస్తున్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ప్రజలను సమానంగా చూడకుండా ఒక వర్గానికి కొమ్ముకాస్తూ కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు పోలీసులు సైతం మంచి చెడులు ఆలోచించకుండా బాధ్యతలు మరిచి అధికార పార్టీ నేతల మాటలకు దాసోహమవడం సిగ్గు చేటంటున్నారు. మంత్రి స్వామి మాటలు విని దేవుని పూజా కార్యక్రమాలకు భగ్నం కలిగించడం దేవుడు సైతం క్షమించడని ప్రజలు అంటున్నారు. వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని రెండు రోజులుగా అడ్డుకోవడం శోచనీయమంటున్నారు. ఇప్పటికైనా మంత్రి స్వామి, టీడీపీ నేతలు ఇలాంటి అపవిత్ర పనులపై దృష్టి పెట్టకుండా ప్రజల సంక్షేమం, ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని కోరుతున్నారు.



చౌటపాలెంలో రెండో రోజు మోహరించిన పోలీసులు

మావాళ్లను కొట్టి వాళ్లపైనే కేసులు పెట్టారు

- దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి
- దర్శి సబ్ జైలులో బాధితులకు పరామర్శ



దర్శి సబ్ జైలులో ఉన్న బాధితుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ

దర్శి: మావాళ్లని కొట్టి వాళ్లపైనే కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారని దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. కురిచేడు మండలం దేకనకొండ గ్రామంలో ఇటీవల వినాయక నిమజ్జనంలో వైఎస్సార్ సీపీ నేతలపై రాళ్లు రువ్వి తిరిగి వైఎస్సార్ సీపీ నేతలపైనే టీడీపీ వర్గీయులు కేసులు పెట్టడంపై బూచేపల్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల తీరును ఖండించారు. దర్శి సబ్‌జైలులో ఉన్న వైఎస్సార్ సీపీ వర్గీయులను జిల్లా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో కలిసి సోమవారం ఎమ్మెల్యే పరామర్శించారు. బాధితుల కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ వినాయక నిమజ్జనం పేరుతో గ్రామంలో వైఎస్సార్ సీపీ నేతలపై కర్రలు, రాళ్లతో టీడీపీ వర్గీయులు దాడులు చేశారన్నారు. వైఎస్సార్ సీపీ నేతలకు రక్తగాయాలయ్యాయని చెప్పారు. దాడి చేసిన వాళ్లు కూడా గుడ్డలు కట్టుకుని మావాళ్లపై కేసులు పెట్టారంటూ మండిపడ్డారు. పోలీసులకు ఈ విషయం తెలిసినా కావాలని వైఎస్సార్ సీపీ నేతలపై కక్షపూరితంగా వ్యవహరించడం మంచిపద్ధతి కాదని హితవు పలికారు. వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలిగానీ.. ఇలా దాడులు చేసి తప్పుడు కేసులు పెట్టడం మంచి సంస్కృతి కాదని అన్నారు. దర్శి నియోజకవర్గంలో గతంలో ఇటువంటి సంస్కృతి లేదని, ఇప్పుడే ఇటువంటి సంస్కృతికి తెరలేపుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదని బూచేపల్లి హెచ్చరించారు.

యువకుడి నిర్లక్ష్యానికి
నిండు ప్రాణం బలి

- మద్యం మత్తులో ద్విచక్రవాహనంతో యువకుడు ఢీకొట్టడంతో వ్యక్తి మృతి
- ఆపై ఆటోను కూడా ఢీకొట్టిన వైనం
- మృతుడు ఆర్టీసీ గ్యారేజీలో మెకానిక్



భర్త మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య



మృతుడిని ఢీకొన్న ద్విచక్రవాహనం

చీరాల: యువకుడి నిర్లక్ష్యానికి ఓ నిండు ప్రాణం బలైంది. మద్యం మత్తులో మితిమీరిన వేగంతో ద్విచక్రవాహనాన్ని నడుపుతూ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ఢీకొనడంతో పాటు వేగాన్ని నియంత్రించలేక ఎదురుగా ఉన్న ఆటోను కూడా బలంగా ఢీకొట్టాడు. మితిమీరిన వేగానికి నిండు ప్రాణం గాలిలో కలిసిపోయింది. ఘటనా స్థలంలో మృతుడి భార్య విలపించిన తీరు అందరినీ కలచివేసింది. ఈ హృదయ విదారక ఘటన సోమవారం చీరాల మండలం జాండ్రపేటలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. చీరాల రూరల్ మండలం జాండ్రపేటలోని గుమస్తాల కాలనీకి చెందిన అచ్చుతుని ఫణికుమార్ (43) చీరాల ఆర్టీసీ గ్యారేజీలో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. రోజూ మాదిరిగానే ఉదయం పాలు తీసుకొచ్చేందుకు బయటకు వచ్చాడు. రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న అతడిని మద్యం తాగి మితిమీరిన వేగంతో ద్విచక్రవాహనాన్ని నడుపుతున్న రవీంద్ర అనే యువకుడు ఢీకొట్టాడు. ఫణికుమార్ పక్కనున్న గోడకు తగలడంతో బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. అయితే ద్విచక్రవాహనం వేగాన్ని నియంత్రించలేక ఎదురుగా ఉన్న ఆటోను కూడా రవీంద్ర ఢీకొట్టాడు. దీంతో ఆటో ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. దెబ్బతిన్న ఆటోను చూస్తే యువకుడు ఎంత వేగంగా వచ్చాడో అర్థమవుతుందని స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న మృతుడి భార్య.. ప్రమాద స్థలంలో విగతజీవిగా ఉన్న భర్తను చూసి గుండెలు పగిలేలా పెట్టిన రోదనలు కలచివేశాయి. మృతుడికి భార్య, ఏడు సంవత్సరాల కుమారుడు ఉన్నారు. మృతుడి తండ్రి అచ్చుతుని బాబూరావు చీరాల ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేసి రిటైరయ్యారు. ఆయన ప్రస్తుతం ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడిగా ఉన్నారు. కుమారుడి మరణవార్త తల్లికి తెలియదని, తెలిస్తే ఆమె కూడా తనకు దూరమైపోతుందని కన్నీటి పర్యంతమయ్యాడు. డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా మితిమీరిన వేగంతో వాహనాలు నడిపే వారిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాబూరావు కోరారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. సీపీఐ, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్, ఏఐటీయూసీ నాయకులు మేడ వెంకట్రావు, బత్తుల శామ్యూల్, చిరమల ప్రకాష్, కేవీ రావు ప్రగాఢ సంతాపం తెలిపారు.



దెబ్బతిన్న ఆటో

ఆర్టీసీ తరఫున ఆర్థిక సహాయం అందజేత...

ఆర్టీసీ చీరాల డిపో గ్యారేజీలో మెకానిక్‌గా పనిచేస్తున్న ఫణికుమార్ మృతిచెందిన సంగతి తెలియడంతో ఆర్టీసీ తరఫున తక్షణ సహాయంగా రూ.25 వేలను మృతుడి తండ్రికి డిపో మేనేజర్ జె.శ్యామల అందించారు. పోస్టుమార్టం అనంతరం ఇంటికి తరలించిన ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. అలానే ఆర్టీసీ తరఫున ఇతర సహాయాలను తక్షణమే అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

నిమ్మకు తెగులు.. రైతుకు దిగులు..!

- నిమ్మ తోటల్లో అదుపుకాని తెగుళ్లు
- తగ్గిన దిగుబడి
- జిల్లాలో సుమారు 3,500 హెక్టార్లలో సాగు




తెగుళ్ల నివారణకు రైతుకు సూచనలిస్తున్న హెచ్ఓ అంజలిబాయి (ఫైల్)

హనుమంతునిపాడు: నిగనిగలాడే నిమ్మ పండుకు తెగులు సోకింది. తోటలన్నీ తెగుళ్లతో నిండిపోవడంతో రైతుకు దిగులు పట్టుకుంది. తెగుళ్ల కారణంగా పంట దిగుబడి తగ్గిపోయింది. దిగుబడి తగ్గడంతో ధర ఊపందుకుంది. జిల్లాలో సూమారు 3,500 హెక్టార్లలో నిమ్మ పంట సాగుచేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. హనుమంతునిపాడు మండలం నిమ్మ సాగులో ఎప్పటి నుంచో జిల్లాలో మొదటి స్థానంలో ఉంది. కనిగిరి డివిజన్‌లోని హనుమంతునిపాడు మండలం నిమ్మ సాగుకు పెట్టింది పేరు. ఈ మండలంలో లేత ముదురు నిమ్మ తోటలు 2,250 హెక్టార్లలో సాగులో ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఈ ఏడాది మొదటి నుంచి నిమ్మ పంటకు ధర రాలేదు. ప్రస్తుతం నిమ్మ ధర నాణ్యతను బట్టి కిలో రూ.70 నుంచి రూ.80 వరకు ఉన్నట్లు రైతులు తెలిపారు. అయితే, మంచి ధర ఉన్నప్పటికీ దిగుబడి లేదు. దిగుబడి తగ్గడంతో కౌలు రైతులకు కౌలు కూడా రాలేదని ఆందోళన చెందుతున్నారు. తెగుళ్లతో నిమ్మతోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఎన్ని మందులు పిచికారీ చేసినా.. తెగుళ్లు మాత్రం అదుపు కావడం లేదని రైతులు వాపోతున్నారు. తెగుళ్ల దెబ్బకు కాయ దిగుబడి బాగా తగ్గిందని చెబుతున్నారు.

పట్టిపీడిస్తున్న పలు రకాల తెగుళ్లు...

నిమ్మ తోటలకు ఎండుపుల్ల తెగులు, మానబంక, వేరుకుళ్లు, పల్లాకు తెగులు, పేను బంక, కాయకు మంగు తెగులు, ఆకుముడత తెగులు సోకాయి. అధికారుల సూచనల మేరకు ఎన్ని మందులు పిచికారీ చేసినా.. తెగుళ్లు అదుపు కావడం లేదు. దీనికితోడు వర్షాభావంతో వ్యవసాయ బోర్లలో భూగర్భ జలాలు అడుగంటాయి. దీంతో తోటలకు డ్రిప్ ద్వారా అందించిన నీరు సరిపడక తోటలు ఎండిపోతున్నట్లు రైతులు చెబుతున్నారు. పండించిన కాయను రైతులు కనిగిరి మార్కెట్‌కు తరలిస్తారు. అక్కడి నుంచి మహారాష్ట్ర, చైన్నై, బెంగళూరు, జయపూర్ ప్రాంతాలకు తరలిస్తారు. ప్రస్తుతం దిగుబడి బాగా తగ్గింది. సొంత భూములున్న రైతులు ఒక మోస్తరుగా నష్టపోగా, కౌలు రైతులు పూర్తిగా దెబ్బతిన్నారు. భారీగా నష్టాలు వచ్చాయని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.



తెగుళ్లతో నాణ్యత లోపించిన నిమ్మకాయలు



తెగుళ్లు సోకిన నిమ్మతోటలు

పవర్ లిఫ్టింగ్‌లో ఏల్చూరి మహిళకు
బంగారు పతకం



వెయిట్ లిఫ్ట్ చేస్తున్న నంద

సంతమాగులూరు (అద్దంకి): రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఏల్చూరి మహిళ బంగారు పతకం సాధించింది. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురంలో ఈ నెల 14, 15 తేదీల్లో రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సంతమాగులూరు మండలంలోని ఏల్చూరుకు చెందిన మహిళా న్యాయవాది కుమారి నంద ప్రథమ స్థానంలో నిలిచారు. వృత్తిరీత్యా న్యాయవాది అయినప్పటికీ.. చిన్నతనం నుంచే పవర్ లిఫ్టింగ్‌పై మక్కువ పెంచుకుని ఎన్నో పతకాలు సాధించారు. 76 కిలోల బాడీవెయిట్ విభాగంలో నంద జిల్లా తరఫున 265 కిలోల బరువును లిఫ్ట్ చేసి రెండో స్థానంలో నిలిచారు. అదే విధంగా బెంచ్ ప్రెస్ ఈవెంట్‌లో బంగారు పతకం సాధించారు. ఆమెను తోటి న్యాయవాదులు, గ్రామస్తులు అభినందించారు. ఈ సందర్భంగా కుమారి నంద మాట్లాడుతూ తనకు ఇండియా తరఫున పాల్గొని బంగారు పతకం సాధించాలనే ఆకాంక్ష ఉన్నట్లు చెప్పారు.



బంగారు పతకంతో కుమారి నంద